## 24నుండి కీలపట్ల కోనేటిరాయుని వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని చిత్తూరు జిల్లా గంగవరం మండలం కీలపట్లలో వెలసిన కోనేటిరాయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుండి మే 03వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల ప్రారంభానికి 21న కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం, 23న సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారి వాహనసేవలు భక్తులను అలరించ నున్నాయి. 24న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం, 28న సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం ఉదయం చక్రస్నానంతో పరిసమాప్త మవు తాయి. ఏప్రిల్ 28న సాయంత్రం 4 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించ నున్నారు. 500 రూపాయలు చెల్లించి ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. మే 03న సాయంత్రం 4 గంటలకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

## శ్రీవారి విఐపి దర్శనం పేరుతో మోసం - నిందితుడు అరెస్ట్

**తిరుమల,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి లోగో దుర్వినియోగం చేసి విఐపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తామని భక్తులను మోసం చేసిన తమిళనాడు తిరువల్లూరు జిల్లాకు చెందిన సి. సెంథిల్ కుమార్ (47) ను తిరుమల 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సిఐ రాముడు వివరాలను తెలిపారు. తిరుమలలో శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తామని సామిజిక మధ్యమాల వేదికల ద్వారా అమాయక భక్తులను మోసం చేస్తున్న వారిని నమ్మవద్దని తెలిపారు. తప్పుడు ప్రకటనలతో భక్తులను మోసం చేస్తున్నట్లు అతనిని గుర్తించారు. విజిలెన్స్ విభాగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2 టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఒక్కో టిక్కెట్‌కు దాదాపు 16,500 రూపాయలు వసూలు చేయడం కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ పేమెంట్‌ల ద్వారా డబ్బులు స్వీకరించడం, నకిలీ హామీలతో భక్తులను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

## ఘనంగా ఆర్డీటి వ్యవస్థాపకుడు డా. విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలు

**అనంతపురం, ఏప్రిల్ 9, (ప్రభాతవార్త బ్యూరో)** 1969లో ఖిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ఖి (ఆర్డిటి)ను స్థాపించి, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలోని గ్రామీణ ప్రజల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలను రెండు తెలుగు రాష్ట్రాలలోని 2,000కి పైగా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతికి విన్సెంట్ ఫెర్రర్ చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రజలు తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న 1,10,000 "సేవా హుండీలనుఖి పగులగొట్టి, అందులోని మొత్తాన్ని సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఇతరులకు సహాయం అందించేందుకు విరాళంగా ఇచ్చారు. 2012లో 40,000 సేవా హుండీల లక్ష్యంతో ప్రారంభమైన "భారతీయుల కొరకు భారతీయుల్ము (ఇండియా ఫర్ ఇండియా) ఉద్యమంలో ఈ సేవా హుండీలు ఒక భాగం. "స్పందించు సహాయం అందించు" అనే నినాదంతో, సామాన్య ప్రజలు,

ఆర్డీటీ సంస్థ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం, మద్దతును అందిస్తున్నారు. కళ్యాణ్ దుర్గం నియోజకవర్గము కుందుర్పి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మోంచో ఫెర్రర్, మహిళా సాదికరత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం

### జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్



**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో జనసేనపార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, ఇందుకు యువతను ప్రోత్సహించి ముందుకు వెళతానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. యువతను, ప్రజలను కలసి సమస్యలు తెలుసుకుని పార్టీ అధినేత ,డిసిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలసి పనిచేసి విజయం సాధిస్తామన్నారు. తిరుపతి నియోజకవర్గంలో చేపట్టిన పార్టీ సభ్యత్వం నమోదు ఐదువేలు పూర్తయిందని, సహకరించిన అందరికీ,యువతకు కిరణ్‌రాయల్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే అధినేతను కలసి వివరిస్తానని చెప్పారు.

## అంతర్రాష్ట్ర స్లీపర్ కోచ్ ప్రైవేట్ బస్సుల సీజ్

**రాజమహేంద్రవరం, ఏప్రిల్9, ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిబంధనలు ఉల్లంఘించిన అంతర్రాష్ట్ర 5 స్లీపర్ కోచ్ ప్రైవేట్ బస్సులు రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సులు ఇటీవల కాలంలో ప్రయాణీకుల ప్రాణాలకు ముప్పు తెస్తున్న తరుణంలో నిబంధనలు పాటించని పలువిషయాను అధికారులు గుర్తించారు.

జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ స్వయంగా రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో ప్రయాణీకుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన పలు ఉల్లంఘనలు గుర్తించినట్లు వెల్లడించారు. బస్సుల్లో అక్రమ అదనపు డీజిల్ ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు ఈ తనిఖీ లో వెలుగులోకి వచ్చింది. అలాగే ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు (హ్యాచ్/డోర్)లను లగేజీతో మూసివేసి వున్నాయి. కొన్ని బస్సుల్లో వెనుక ఎమర్జెన్సీ డోర్ లేకపోవడం గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన అంతరాష్ట్ర ప్రైవేటు బస్సుల పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డిటిఓ సురేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్ర రం నుండి హైదరాబాద్ ,బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు నడుస్తున్న ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ ప్రైవేటు బస్సులపై స్థానిక రవాణా శాఖ అధికారులు బుధ, గురువారాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పర్మిట్ నిబంధనలను అతిక్రమించడం మాత్రమే కాకుండా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఈ తరహా చర్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. సీజ్ చేసిన బస్సులను స్థానిక ఆర్టీవో కార్యాలయం భద్రపరిచామని వీటికి సంబంధించి రెండు లక్షల 15 వేల రూపాయలు పన్ను ,అపరాధ రుసుము బస్సు యజమానులు చెల్లించవలసి ఉందన్నారు.

## ఆడపిల్లల చదువు సమాజ అభివృద్ధికి పునాది

### - మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



జ్యోతి ప్రజ్వలనతో స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ఆడపిల్లల చదువు సమాజాభివృద్ధికి పునాది అని, మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావాలని, భవిష్యత్తులో వారికి రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గురువారం చిత్తూరులోని శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళాకళాశాల 44వ వార్షికోత్సవం. స్నాతకోత్సవం, నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ముందుగా హాస్టల్ భవనాన్ని ప్రారంభించిననంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బంగారుపతకాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేసారు. జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌లు అతిథులుగా విచ్చేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ముందుగా భవనాల నిర్మాణానికి విరాళాలిచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. అలాగే కళాశాల స్థాపించిన 45 ఏళ్ల తర్వాత కూడా శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ కుటుంబసభ్యులు ఈ కళాశాలకు తమ సహకారాన్ని అందిస్తుండడం ఆమె పట్ల వారికున్న అభిమానానికి, బాధ్యతకు నిదర్శనమన్నారు. మహిళా విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా శిశుమరణాల రేటు తగ్గుదల, కుటుంబ ఆరోగ్యం, మెరుగు, పిల్లల పోషణతో పాటు విద్యాపరమైన అవకాశాల మీద సానుకూల ప్రభావం ఏర్పడి అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సరైన అవకాశాలు కల్పించి గౌరవించినప్పుడే సౌభాగ్యం వెల్లివిరుస్తుందని, మహిళా సాధికారత సాధ్యం కావాలంటే ముందు సమాజంలో ఆలోచనా కోణంలో మార్పురావాలని కోరారు. బేటీ బచావ్ బేటీ పడావ్ నినాదంలో భారత ప్రభుత్వం మహిళా సాధికారత ధ్యేయంగా ముందుకు సాగుతుండడం అభినందనీయమని, ఈ విషయంలో అటల్‌బిహారీ వాజ్‌పేయి చేసిన కృషిని గుర్తుచేసారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి సైతం బాలికలకు చదువుతో పాటు అనేక విషయాల్లో ప్రోత్సాహం, తగిన గుర్తింపు ఇచ్చే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం జిల్లాకలెక్టరు మాట్లాడుతూ 2016లో ముస్సోరిలో ట్రైనింగ్ పూర్తి అయిన అనంతరం అప్పటి ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు తమ బ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన సందర్భాన్ని స్మరించుకొంటూ, ఆయన ఇచ్చిన మార్గదర్శక సూచనలు ఇప్పటికీ తనను ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన కొత్తహాస్టల్ భవనం ద్వారా సుమారు 200మంది విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించబడుతుందని, ఇది విద్యార్థుల ఆర్థికభారం తగ్గించడంలో కీలకంగా వుంటుందన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులపై ఆందోళనకు వైసిపి సన్నాహాలు

### - కాలవలు, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని నేడు అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం - మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి రాక

**అనంతపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త బ్యూరో** రాయలసీమ ఎత్తిపోత పథకం పనులు పూర్తి చేయాలని, అనంతపురం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కాలవ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆందోళనకు సిద్ధమవుతోంది. సాగునీటి ప్రాజెక్టుల కింద కాలవ పనులను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చి జలహారతి చేస్తామని రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెబుతున్ననేపథ్యంలో సాగునీటి పథకాల కింద కాలవ పనులు పూర్తి చేస్తేనే ఆయకట్టుకు నీరు వస్తుందని వైసిపి నేతలు చెబుతున్నారు. శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతం నుంచి రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను గతంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిందని ఆ పనులను పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వాలని వైసిపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఎక్కువ నీటిని వర్షాకాలంలో వృథాగా వెళ్తున్న నీటిని మళ్లించవచ్చని మంచి ఉద్దేశ్యంతో అమలు చేసిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయాలని వైసిపి నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే కర్నూలు జిల్లాలో రాయలసీమ ఎత్తి పోతల పథకం పనులను వైసిపికి చెందిన రాయలసీమ జిల్లాల ప్రతినిధులు పరిశీలించిన విషయం తెలిసిందే. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసిపి నేతలు, కార్యకర్తలు సీమ జిల్లాల్లో ఆందోళనకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం (10వ తేది) ఉదయం 10:00గంటలకు అనంతపురం లోని గుత్తి రోడ్డులోగల కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తోంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని అనంతపురం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అనంతపురంపార్లమెంట్ పరిశీలకులు, ఓ.రెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు హాజరవుతున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు, జడ్పి చైర్మన్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, పార్టీ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ, దాని అనుబంధ సంఘాల నాయకులు, ఇతర ముఖ్యులు హాజరు కానున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పట్టణ అధ్యక్షులు, వైసిపి మ ండల అధ్యక్షులు, ఎంపిపిలు, జడ్పిటిసిలు తదితర ముఖ్యులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు గట్టి సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో నిర్వహించిన సభకు హాజరయ్యారు. యాడికి మండలంలో కణేకల్లు రిజర్వాయర్ పనులను పరిశీలించడంతోపాటు రైతులతో మాట్లాడటం, యాడికి మండల కేంద్రంలో బహిరంగ సభలోనూ, పార్టీ కార్యకర్తలతోనూ ప్రత్యేక సమావేశాలు సీఎం నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు యాడికిలో సభ నిర్వహించి వెళ్లిన కొద్ది రోజులకే తాగునీటి ప్రాజెక్టులపై వైసిపి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం గమనించ దగ్గ విషయం.

వైసిపి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని వైసిపి నేతలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది. యాడికి సభలో రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లి ఇచ్చి జలహారతి చేస్తామని, పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల్లోగా పూర్తి చేస్తామని, పోలవరం ద్వారా ఆదా అయ్యే నీటితో శ్రీశైలం ప్రాజెక్టు నీళ్లు అన్నీ సీమ జిల్లాలకు మళ్లిస్తానని తదితర హామీలను సీఎం చంద్రబాబు చేసిన విషయం తెలిసిందే.

## రాజధానిపై ప్రజల నమ్మకం గెలిచింది

### టిడిపి నేత దువ్వారపు రామారావు..

విజయవాడ, ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:అమరావతికి చట్టబద్ధత రావడం ఒక చారిత్రాత్మకం దేశంలోనే చట్టబద్దత పొందిన ఏకైక రాజధాని అమరావతి చరిత్రలో నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదని టీడీపీ నేత దువ్వారపు రామారావు..కొనియాడారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు కలలు కన్న రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేసుకుంటున్నారని ఆయన వ్యక్తం చేశారు.

రాష్ట్ర పతి ఆమోదంతో అమరావతి శాశ్వత రాజధానిగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో అమరావతి చరిత్రలోనే ఉన్నతస్థానంలో నిలువింది. 201419 మధ్య కాలంలో అమరావతిపై అసెంబ్లీలో చర్చ నడుస్తున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడయిన జగన్ అమరావతిని రాజధానిగా స్వాగతిస్తూ అమరావతికి కొద్దిపాటి భూమి సరిపోదు దాదాపు 30 వేల ఎకరాల భూమి కావాలి అని ఆయన చెప్పారు. అంతేకాకుండా అమరావతిలో నేను ఇల్లు కట్టుకుంటాను అని మాట కూడా ఇచ్చాడు తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మండలిలో మూడు రాజధానుల బిల్లు ఆమోదానికి వచ్చినప్పుడు టీడీపీ నాయకులు దానిని వ్యతిరేకించడం కూడా జరిగింది. ఈ రోజు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత పొందడం వెనుక మా కృషి ఉండడం మా అదృష్టంలా భావిస్తున్నాం. అమరావతిలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. అటు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఒక మధ్యస్థ ప్రాంతంగా ఉండాలని ఇక్కడ రాజధానిగా అమరావతిని ప్రవేశపెట్టారు. కృష్ణా నదీ తీరంలో అమరావతిని నిర్మించడానికి ప్రజల, అన్ని పార్టీలు స్వాగతించాయి. వైసీపీ ప్రభుత్వం అమరావతిని ఎన్నో రకాలుగా దూషించారు. మునిగిపోయే ప్రాంతమని, శ్మశానం, ఎడారి, ఎందుకు పనికిరాని భూములని అనేక రకాలుగా విమర్శించారు. గత ఐదేళ్ల పాలన ఎంత దుర్మార్గంగా కొనసాగిందో ప్రజలందరికి తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని ప్రాంతంలో అనేక మార్పులు చూస్తున్నాం. 58 వేల కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టి అనేక భవనాలు నిర్మాణం జరుగు తున్నాయి. చంద్రబాబు మీద అభిమానంతో రాజధాని నిర్మాణం కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమును స్వచ్ఛం దంగా ఇవ్వడం దేశ చరిత్రలోనే గర్వించదగ్గ విషయం ఇది ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఆ అభిమానాన్ని నిలబెట్టు కుంటూ చంద్ర బాబుగారు 201419 కాలంలో అమరావతిలో సెక్రటేరియేట్, ప్రజాప్రతినిధుల భవనాలు వంటివి నిర్మించి రహదారులు, మౌళిక సదుపాయాలు కల్పించడానికే సుమారు రూ.48 వేల కోట్లతో పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంధకారంలో పడి ఉన్న అమరావతిని తిరిగి పట్టాలెక్కించేందుకు అనేక కృషి చేసి శాశ్వత రాజధానిగా నిలబెట్టారు. అమరావతి రాజధాని అంటే యువతకు కలల సౌధం. 26 జిల్లాల ప్రజలకు ఉద్యోగ కల్పవల్లి. గతంలో హైదరాబాద్ ను చంద్రబాబు గారు సైబరాబాద్ గా రూపకల్పన చేశారు దాని ద్వారా 70 శాతం ఆదాయంతో ప్రతి పల్లెకు నిధులు సమకూర్చేలా హైదరాబాద్ సహాయపడుతుంది. అమరావతి నిర్మాణంతో 13 జిల్లాల అభివృద్ధి, ప్రతి పంచాయతీ నిక్షేపానికి ఆదాయ వనరుగా నిలుస్తుంది. ఉత్తరాంధ్రా జిల్లా వాసిగా అమరావతిని రాజధానిగా నిర్ణయించి నప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలు, రాయలసీమ ప్రజలు అందరూ స్వాగతించారు. ఎందుకంటే ఇది అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉంది. విశాఖని రాజధానిగా ప్రకటించినప్పుడు విశాఖ ప్రజలు ఆనందపడాలి కానీ, దానికి మేము ఒప్పుకోలేదు ఎందుకంటే పరిపాలనా కేంద్రమంటే భవిష్యత్తుకు నాంది.

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. హైదరాబాద్ రూపకల్పన ద్వారా అక్కడ ప్రజలు ఎలా అభివృద్ధి చెందారో అమరావతి నిర్మాణం ద్వారా ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందుతారు.

## ఉపాధి హామీపథకంపై సిపిఐ పాదయాత్ర

**అనంతపురం, ఏప్రిల్ 9, (ప్రభాత వార్త బ్యూరో)** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు పాదయాత్ర జరుగును.. ఈనెల 10వ తేదీన ఉదయం 9:30 గంటలకు అనంతపురంలోని పంగల్ రోడ్డు దగ్గర సమతా గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జాతీయస్థాయిలోనే సింగనమల నియోజకవర్గం నార్పల మండలం బండ్లపల్లి లో గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పులు చేసి అమలు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

గతంలో ఉన్న విధంగానే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఇప్పుడు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలలో మూడు రోజులు పాటు పాదయాత్ర నిర్వహిస్తోంది. అనంతపురం శివారులోని సమతా గ్రామం వద్ద నుంచి ప్రారంభించి బత్తలపల్లె మీదుగా నార్పల మండలం బండ్లపల్లి వరకు సిపిఐ పాదయాత్ర నిర్వహిస్తోంది.

## అక్రమ వేటకు శాశ్వత అడ్డుకట్టే లక్ష్యం

### - కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా. ఆజితా వేజెండ్ల ముఖాముఖి

**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త** గురువారం నెల్లూరు టౌన్ హాల్లో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 162 గ్రామాల మత్స్యకార కాపులు, మత్స్యకారులతో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డా. అజితా వేజండ్ల ముఖాముఖీ సమావేశం నిర్వహించారు, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ వేట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. మత్స్యకారుల అభిప్రాయాల మేరకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపడుతోందన్నారు. తొలుత మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా. శాంతి అజెండాలోని అంశాలను వివరించగా, ప్రధానంగా పీఎంఎంఎస్‌వై పథకం కింద రూ.1.20 కోట్లతో నాలుగు హైస్పీడ్ బోట్ల కొనుగోలు, లబ్ధిదారుల ఎంపిక, బోట్ల రకం ఎంపిక, నిర్వహణ, మరమ్మతులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన మత్స్యకార గ్రామాల కాపులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ 650 హెచ్‌పి సామర్థ్యం గల స్టీల్ బోట్లనే కొనుగోలు చేయాలని, వాటి నిర్వహణను ప్రభుత్వమే భరించాలని సూచించారు. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలోని బోట్లకు రిపేర్లు చేయాలని, గస్తీ బోట్లలో పనిచేసే మత్స్యకారులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తీర గస్తీ బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలని, సబ్సిడీ పెంచితే తామే బోట్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తమిళనాడు జాలర్ల అక్రమ వేట, దాడులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ ప్రవేశాన్ని పూర్తిగా అడ్డుకునేందుకు పటిష్ట వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. ఈ క్రమంలో దక్షిణ కోస్తా నాలుగు జిల్లాల తీరప్రాంతంలోని 23 మండలాల మత్స్యకారులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. తమిళనాడు బోట్లను ఎలా అడ్డుకోవాలి, పట్టుకున్న తర్వాత ఏం చేయాలి, ఎంతకాలం ఉంచాలి వంటి అంశాలపై చర్చించామని వివరించారు. నాలుగు జిల్లాలకు నాలుగు హైస్పీడ్ బోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తిరుపతి జిల్లాకు ఒకటి, నెల్లూరు జిల్లాకు రెండు, బాపట్ల జిల్లాకు ఒక బోటును మంజూరు చేయగా, ప్రకాశం జిల్లాకు కూడా బోటు మంజూరు చేసేలా ప్రతిపాదనలు.


## దుర్గమ్మ ఆలయంలో చలివేంద్రం - దాతలకు ఆహ్వానం



దాతలకు దుర్గమ్మ మెమొంటో అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి భక్తులకు ఈ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఆలయంలో ఏర్పాటు చేసిన చల్లటి మంచినీరు, మజ్జిగ పంపిణీకి దాతలు ముందుకు రావాలని ఇఓ వికె శీనా నాయక్ పిలుపునిచ్చారు. ఉగాది పర్వదినం నుండి జూన్ 15 వరకు ఈ చలివేంద్రాలు భక్తుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేశామన్నారు. దాతలు రు.650 ఒక్కరోజుకు విరాళంగా అందించవచ్చన్నారు. అధికసంఖ్యలో దాతలు ముందుకు రావాలన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎం యామిని అరుణ శ్రీ రు.1లక్ష విరాళం గురువారం అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు రు.1,11,116 విరాళం గురువారం విజయవాడకు చెందిన జి భరత్ అందించారు. విజయవాడ కామయతోపుకు చెందిన పొత్తులూరి అనిత నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళం గురువారం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## తిరుపతిలో దాడులు, ప్రతిదాడులు తగ్గుముఖం: ఎస్సీకమిషన్ చైర్మన్ జవహార్




**తిరుపతి,ఏప్రిల్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో సమర్థవంతమైన జిల్లా అధికారులపర్యవేక్షణలో ఎస్సీవర్గాల సమస్యల పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె. ఎస్. జవహర్ పేర్కొన్నారు. అంతేగాక ఎస్సీలపై దాడులు,ప్రతిదాడులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో షెడ్యూల్ కులాల పై వివక్ష, వేదింపుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ గోవిందరావు ఇతర అధికారులతో కలసి జరిగిన సమావేశం వివరాలను మీడియా ప్రతినిధులకు కమిషన్ చైర్మన్ వివరించారు. జిల్లాలో వివక్షాపూరిత ఘటనలు తక్కువగా ఉన్నాయని, కొద్దిపాటి భూ వివాదాలు, ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ దాడులు, ప్రతిదాడులు తగ్గుముఖం పట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎస్సీలకు సంబంధించి మొత్తం 68 కేసులు పెండింగ్‌లో ఉండగా, అందులో 18 అట్రాసిటీ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీటిని డివిజన్ ల వారీగా వర్గీకరించి త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించానన్నారు. ప్రతిగ్రామంలో స్మశాన వాటికల నిర్మాణం చేపట్టి జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, ముద్రా లోన్లు తదితర సంక్షేమ పథకాలపై దళితులకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

## సెల్ఫీ దిగుతూ జలపాతంలో పడి ముగ్గురు బాలికల మృతిపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం మూలగుమ్మి జలపాతంలో ముగ్గురు బాలికలు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తూ జలపాతంలో పడి బాలికలు మృతిచెందడం అత్యంత విషాదకరమని తెలిపారు. ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి భవిష్యత్‌కోసం కలలు గంటున్నారని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని తెలిపారు.

అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## ఉగ్రమూలాల కేసు దర్యాప్తులో సంచలనాలు

### - మహిళల పేరిట ఖవాతీన్ ప్రత్యేక విభాగం

**విజయవాడ, ఏప్రిల్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఉగ్రమూలాల కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో రిమాండ్ ఖైదీలను దశలవారిగా పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. తొలి దశలో కస్టడీకి తీసుకున్న ఆరుగురు నిందితులు విచారణలో అంశాల ఆధారంగా నిందితులు ఇండియాను ఇస్లామిక్ రాజ్యంగా మార్చేందుకు భారీగా కుట్ర చేసిన విషయం స్పష్టమైనట్లు సమాచారం. ఈ క్రమంలో మరో ఆరుగురిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. జిహాదీ కార్య కలాపాల్లో మహిళలను భాగస్వాముల్ని చేసేందుకు విదేశీ హ్యాండ్లర్లు మహిళలతో ఖవాతీన్ పేరిట ఏకంగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసు కున్నట్లు అధికారులు గుర్తించారు. సామాజిక మాధ్యమాల ద్వారా మహిళల్ని ఈ ఉచ్చులోకి లాగేవారని నిర్ధారించారు. ఈ కేసులో పట్టుబడిన హైదరాబాద్‌కు చెందిన సైదాబేగం ఖవాతీన్ బాధ్యతలు చూసేవారని గుర్తించారు. ఆమెకు పాకిస్థాన్, జమ్మూకశ్మీర్ లోని జిహాదీలతో సంబంధాలున్నాయని రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ దర్యాప్తులో తేలింది. భారత్‌లో ఇస్లామిక్ రాజ్య స్థాపనే లక్ష్యంగా యువతను జిహాద్ వైపు మళ్లించిన వారిలో అల్ హకీం షకూర్ కాకుండా మరో ఐదుగురు విదేశీ హ్యాండ్లర్లు ఉన్నట్లు గుర్తించారు.

## అభివృద్ధి పేరుతో కార్పొరేటర్ల చేతుల్లో భూములు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త** అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కార్పొరేటర్లకు భూములు కట్టబెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం పట్టణంలోని సాయి ఆరామం లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమలో సోలార్ హబ్ పేరిట వేల ఎకరాలు రైతుల నుంచి తీసుకుంటున్నారన్నారు. వేల ఎకరాలు తీసుకొని వందలలో ఉపాధి కల్పిస్తున్నారని అదే వ్యవసాయ అభివృద్ధి చేపడితే వేలాదిమందికి ఉపాధి కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకసారి రైన్ గన్స్ అంటారని ఇంకోసారి ఆర్టిక హార్టికల్చర్ హబ్, డ్రోన్ హబ్, పరిశ్రమల హబ్ అంటాడని అభివృద్ధిపై స్థిరత్వం లేదన్నారు. పరిశ్రమల స్థాపన అంటూ వేల ఎకరాలు తీసుకొని కార్పొరేటర్లకు ధారాధతం చేస్తున్నారన్నారు, లేపాక్షి నాలెడ్జ్ హబ్ కు ఎనిమిది వేల ఎకరాలు తీసుకొని ఒక్క పరిశ్రమ పెట్టకుండా బ్యాంకులలో 4600 కోట్లు అప్పు తీసుకొని ఐపి పెట్టి 500 కోట్లు మాత్రం ఆ కంపెనీ చెల్లించిందన్నారు.

